క్లుప్తంగా

మున్సిపల్ స్థల విక్రయ అంశాన్ని వ్యతిరేకిద్దాం

-కార్పొరేటర్లకు విప్ జారీ చేసిన వైఎస్సార్‌సీపీ

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే 924 అంకణాల ప్రజల ఆస్తి గాంధీ విగ్రహం సమీపంలోని (గతంలో చాళుక్య లాడ్జి) స్థలాన్ని అమ్మడాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై చర్చించేందుకు బుధవారం నిర్వహించనున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశానికి తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లందరూ హాజరు కావాలని ఆ పార్టీ విప్ జారీ చేసింది. సమావేశంలో చర్చకు వచ్చే అజెండా నంబర్ 71 మున్సిపల్ స్థల విక్రయ అంశాన్ని వ్యతిరేకించాలని, ప్రజల ఆస్తిని కాపాడేందుకు తమ కార్పొరేటర్లందరూ పోరాడాలని ఆ పార్టీ తరపున 1వ వార్డు కార్పొరేటర్ రాధారెడ్డి కోరారు.

మహిళను హింసించిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అప్పు కట్టలేదని మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిని అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భర్త చేసిన అప్పులు చెల్లించలేదని, ఆమెను చెట్టుకు కట్టేసి కొట్టడం అమానుషమని నిరసించారు. నిందితుడు మునిరత్నం, అతని కుమారుడు, సంబంధించిన వారి కఠినంగా శిక్షించి, ఆ మహిళా కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మహిళా సాధికారితతో వెలిగిపోతోందన్న కూటమి నేతలు మహిళలకు రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు.

భవిత పాఠశాల ఆకస్మిక తనిఖీ



శిక్షణను పరిశీలిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: స్థానిక భవిత పాఠశాలను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి, ప్రత్యేక ప్రతిభావంతులకు అందిస్తున్న శిక్షణను, ఎఫ్‌ఎంతో కూడిన యూఎస్‌బీ, హ్యాండ్ మైక్‌లను పరిశీలించారు. పిల్లలకు అందించే బోధనా పద్ధతుల గురించి ఆయన అక్కడి స్టాఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన శిక్షణ అందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.


కాలేజీ మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ/పీజీ కళాశాల మ్యాగజైన్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణయ్మ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు, అధ్యాపకులలోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రతి ఏటా కళాశాల మ్యాగజైన్ వెలువరిస్తున్నట్టు చెప్పారు. ఇందులో వివిధ రకాల వ్యాసాలు, కథలు, సామాజిక అంశాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విద్యార్థి దశ నుంచే రచనలను అలవాటు చేయటం ఈ మ్యాగజైన్ ప్రధాన ఉద్దేశం అన్నారు. మ్యాగజైన్ కోఆర్డినేటర్ తెలుగు విభాగాధిపతి డాక్టర్. వి కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినులు రచనా శక్తిని పెంచుకోవటం వలన భవిష్యత్తులో కవులు, రచయిత్రులుగా రాణిస్తారనే నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో మ్యాగజైన్ కమిటీ సభ్యులు డాక్టర్ సునీత, డాక్టర్ శోభ, సుధాకర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ భద్రమణి, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పెంచలయ్య, కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుమలలో ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ వ్యవస్థాపకుడు వందలూరు నరసింహులు 11వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన కుమారులు పెంచలయ్య, ప్రసాద్ కుటుంబ సభ్యులు మంగళవారం రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు, వారి సహచరులు పాల్గొన్నారు.

రామాంజులుకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎకనామిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి డి.రామాంజులుకు వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ డి.క్రిష్ణమూర్తి పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ టూరిజం ఇన్ ఏపీ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ టూరిస్ట్ సెంటర్స్ ఇన్ కర్నూల్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

మరుపొంగళ్ల భక్తజనం



ముత్యాల అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ

- మొక్కుల చెల్లింపుతో పరవశం
- మరుపొంగళ్ల మొక్కులు పరిసమాప్తం
- ముత్యాల అలంకరణలో గంగమ్మ తేజోమయం



అమ్మవారి కొడిస్తంభం వద్ద పొంగళ్ల నైవేద్యం సమర్పిస్తూ మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: కరుణించి కాపాడు.. గంగమ్మా తల్లీ! అంటూ భక్తజనం మంగళవారం తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించడం పరిపాటి. చివరి ఐదవ మంగళవారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించేందుకు ఆలయానికి వచ్చారు. రాత్రి వరకు భక్తుల రద్దీ నెలకొంది. తొలుత ఉదయం ఆలయంలో అమ్మవారి మూల విరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ముత్యాల పల్లకి సేవ తరహాలో గంగమ్మను ముత్యాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, కొలువు తీర్చి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వయోభేదం లేకుండా మొక్కుబడి వేషాలతో పలువురు భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలతో ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అంబలి పోశారు. ఏర్పాట్లను ఈవో ఏ.జయకుమార్ పర్యవేక్షించి భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

రంగస్థలి కళాకారులు వేషాల సందడి

మరు పొంగళ్ల నేపథ్యంలో చివరి మంగళవారం రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలతో సందడి చేశారు. వివిధ పౌరాణిక వేషధారణలతో అమ్మవారికి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.



సందడి చేస్తున్న రంగస్థలి కళాకారులు

నోటీస్ బోర్డు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశం.
- శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లకు సంబంధించి సెప్టెంబర్ నెల కోటా ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్న టీటీడీ.
- భారతీయ విద్యా భవన్‌లో ఉదయం 11 గంటలకు పుస్తకావిష్కరణ సభ.
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అనుబంధ శ్రీసుందరరాజస్వామి ఆలయంలో స్వామివారి అవతారోత్సవాల్లో రెండవ రోజు ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం రాత్రి స్వామివారి హనుమంత వాహన సేవ.
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్దనున్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం.

రైతులపై కూటమి పగ

- అర్హులకు అందని సబ్సిడీ వేరుశనగ
- ఓ వర్గానికి చెందిన టీడీపీ సానుభూతి పరులకు ఇవ్వడంపై మరో వర్గం మండిపాటు
- మామిడి తోటలు, భూములను అన్యాక్రాంతం చేసిన వారికే విత్తనకాయలు



వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న సర్పంచ్

రామచంద్రాపురం: అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనకాయలను అందించకుండా అధికారులు కూటమి నాయకుల ఆదేశాల మేరకు వారి కార్యకర్తలకు అందించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సోమవారం నుంచి మండలవ్యాప్తంగా వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. అయితే మధ్యాహ్నం లోపే 1,331 బస్తాల విత్తనకాయలు అయిపోయాయంటూ చెప్పారు. అయితే రైతులకు అందాల్సిన విత్తనకాయలను అధికారులు కూటమి కార్యకర్తలకు అందించడంపై అనుప్పల్లిలో రైతుల నుంచి ఆగ్రహజ్వాలలు వ్యక్తమయ్యాయి. అధికారులు అందించే స్లిప్పుల్లో రైతుల వివరాలు లేకుండానే అందించిన రశీదులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో మంగళవారం అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నాయకులు అనుప్పల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. ఈ క్రమంలో మరో వర్గానికి సమాచారం అందకపోవడంతో వాట్సాప్ గ్రూపుల్లో తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కష్టపడితే తమకు కనీస సమాచారం ఇవ్వకుండా విత్తనకాయల పంపిణీని ప్రారంభించడం ఏమిటంటూ టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడుకి పరోక్షంగా హితవు పలికారు.

ఏఓపై మండిపాటు

మండల వ్యవసాయ అధికారి మమత సోమవారం ఒక్కరోజే 1331 బస్తాలు పంపిణీ చేసినట్లు ప్రకటించడంపై రైతులు మండిపడ్డారు. ఇప్పటి వరకు అర్హులైన రైతులకు అందించకుండా కూటమి కార్యకర్తలకు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అనుప్పల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూటమి నాయకులు, వారి అనుచరులకు వేరుశనగ పంపిణీ చేయడంపై స్థానిక సర్పంచ్ సాంబ యాదవ్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు దేవరాజుల రెడ్డి, సీనియర్ నేత శంకర్ రెడ్డితో పాటు పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అందించాల్సిన విత్తనాలను అనర్హులకు ఎలా పంపిణీ చేస్తారంటూ వ్యవసాయ అధికారులను నిలదీశారు. కనీసం స్థానిక సర్పంచ్ అయిన తనకు కూడా సమాచారం అందించకుండా పంపిణీ చేయడంపై ఆయన మండిపడ్డాడు. కూటమి పార్టీ నాయకులు ఏ అర్హత ఉందని పంపిణీ చేస్తారని నిలదీశారు. మండలంలోని అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయకపోతే రైతులతో కలసి నిరసనకు దిగుతామని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో కూటమి నేతలు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసు భద్రత నడుమ విత్తనకాయలను కూటమి కార్యకర్తలకు పంచి పెట్టడంపై మండల రైతన్నలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన తమకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయాలంటూ రైతులు కోరుతున్నారు.

భర్త మరణం..బతుకు దైన్యం

-వితంతు పింఛను కోసం పసిబిడ్డతో ప్రదక్షిణలు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం లేదు. ఉన్న పింఛన్లను తొలగిస్తున్నారు. కనీసం వితంతువులు, ఒంటరి మహిళలకు కూడా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారు జీవనం కోసం ఇబ్బందులు పడుతున్నారు. పింఛను మహాప్రభో అని కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక్కడ చిత్రంలో పసిబిడ్డతో కనిపిస్తున్న అభాగ్యురాలి పేరు షబీనా. స్వస్థలం శ్రీకాళహస్తి. ఇద్దరు చంటిబిడ్డలు ఆమెకు సంతానం. మూడు నెలల క్రితం ఆమె భర్త రేవంత్‌కుమార్ అనారోగ్యంతో చనిపోవడంతో ఆమె ఒంటరికి బతుకు తలకిందులైంది. వితంతు పింఛను మంజూరు చేస్తే ఆ సొమ్ముతో తన పిల్లలను పోషించుకోవచ్చనే బతుకుపై ఆశ. ఆ ఆశతో మూడు నెలలుగా కలెక్టరేట్‌కు వచ్చి వెళ్తోంది. గ్రీవెన్స్‌లో పలుసార్లు అర్జీలు సైతం ఇచ్చింది. తొలుత తమ సచివాలయ ఉద్యోగులను కలిసి తన గోడు నివేదించింది. తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వం మంజూరు చేయాలని వారు చేతులెత్తేశారు. జిల్లా అధికారులైనా సాయం చేస్తారనే ఆశతో మంగళవారం మరోసారి కలెక్టరేట్‌కు వచ్చింది. పాపం..ఈ అభాగ్యురాలిని ఇకనైనా కరుణిస్తారా!?



చంటి బిడ్డతో వచ్చిన వితంతువు షబీనా

కూటమి ఏడాది పాలన అంతా వైఫల్యమే..!



బుక్ లెట్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఏడాది కూటమి పాలన వైఫల్యాల పుట్టగా మారిందని సీపీఎం నేతలు ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను దగా చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి పాలన వైఫల్యాలపై సీపీఎం ప్రచురించిన బుక్‌లెట్‌ను మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా నేతలు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, నగర నేతలు వేణుగోపాల్, మాధవ్ మాట్లాడారు. కేంద్రంలోని మోదీతో జతకట్టిన టీడీపీ, జనసేన నేతలు రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి కార్పొరేట్లకు సంపద ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. రోజువారీ కక్ష సాధింపు చర్యలు తప్ప ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. టీటీడీ ప్రక్షాళన చేస్తామన్న కూటమి నేతలు వివాదాలకు కేంద్రంగా మార్చేశారని, స్వల్ప కారణాలను చూపి మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. పోరాటాలతో సాధించిన కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ హరిస్తుంటే కేంద్రానికి వంత పాడుతూ, కార్మికులకు పని గంటలను 12 గంటలకు పెంచిన హీన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి ఏడాది పాలన వైఫల్యాల బుక్‌లెట్లను విస్తారంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నేతలు బుజ్జి, నరేంద్ర, రమేష్, జయంతి పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

చంద్రగిరి: కలుషిత నీరు తాగడం వల్ల డయేరియాతో కలిగే ఇతర అనర్థాలపై డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రగిరి బీడీ కాలనీలోని మహిళా భవనంలో ఈ మేరకు మంగళవారం స్థానికులకు డయేరియా, దోమల నివారణ చర్యలు, లింగ నిర్ధారణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యానేరమని అటువంటి చర్యలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, సంఘమిత్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు ఇవ్వరూ!

-ఎస్వీయూ వీసీకి ఏబీఆర్‌ఎస్‌ఎం వినతి



వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏబీఆర్‌ఎస్‌ఎం నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న అర్హులైన అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఏబీఆర్‌ఎస్‌ఎం సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎస్వీయూ వీసీ అప్పారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ.రామిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎం.రమేష్ కుమార్, వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పరీక్షల విభాగం పనితీరు దారుణంగా ఉందని, వెంటనే ప్రక్షాళన చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎస్వీయూలో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా ఫలితాలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. డిగ్రీ, లా, పీజీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల రీ-వాల్యుయేషన్ ఫలితాలు సకాలంలో విడుదల చేయడంలో పరీక్షల విభాగం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. అకడమిక్ షెడ్యూల్ ప్రకారం డిగ్రీ, లా, పీజీ పరీక్షలు నిర్వహించకపోవడం వలన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన పీజీ మొదటి, మూడవ సెమిస్టర్ ఫలితాలు ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-ఆర్డినేటర్ అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, జిల్లా నాయకులు బాల, తిరుమలేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును యథావిధిగా కొనసాగించాలని, అప్పుడే తాము పనులు చేస్తామని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఆందోళన బాట పట్టారు. గత ఐదు రోజులుగా గ్రామంలో ఎక్కడ పడితే చెత్త, పేడదిబ్బలు, కాలువల్లో డ్రైనేజీ తీయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఏ తప్పు లేకుండా సెక్రటరీ వెంకటేశ్వర్లును చేయకుండానే బదిలీ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం

- కేంద్ర కార్మిక సంఘాల నేతల పిలుపు
- 8 గంటల పని విధానాన్ని రద్దు చేసే దిశగా కూటమి ప్రభుత్వం యోచన
- 20న అన్ని మండలాల్లో ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల నేత సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కడుపు కొడుతున్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల అమలుతో కార్మికులు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ అనుబంధ బీఎంఎస్ మినహా కేంద్ర కార్మిక సంఘాలన్నీ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈనెల 20న కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, పని గంటల పెంచేందుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని మండల కార్యాలయాల వద్ద ఈనెల 20న ధర్నా చేయాలన్నారు. దశలవారీ చేయనున్న ఆందోళన కార్యక్రమాలను ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌డీ.రవి, సీఐటీయూ నేత బుజ్జి, మాధవ, ఐఎఫ్‌టీయూ నేతలు లోకేష్, వెంకటేష్ సుజాత, రాణి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి



వినాయకసాగర్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా : వినాయక సాగర్ అభివృద్ధి పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం వినాయక సాగర్‌ను, కొర్లగుంట వద్ద మురుగు కాలువ నిర్మాణ పనులను ఆమె కమిషనర్ పరిశీలించి మాట్లాడారు.వినాయక సాగర్‌లో స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, సాగర్ వాకింగ్ ట్రాక్‌లో పెరిగిన మొక్కలు కత్తిరించి వాకర్లకు ఇబ్బంది లేకుండా చేయాలని, ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద మురుగు కాలువ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు.

207 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ

తిరుపతి తుడా: నగర పాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టీడీఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామన్నారు. పలుమార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించి ఈ బాండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని చెప్పారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు

సంక్షేమ చట్ట సాధన పోరాటాలకు సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: సంక్షేమ చట్టం సాధన కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి హమాలీ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం అన్నమయ్య సర్కిల్లో హమాలీ వర్కర్స్ యూనియన్ నగర బహిరంగ సభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హరినాథరెడ్డి యూనియన్ జెండా ఆవిష్కరించిన అనంతరం సభలో మాట్లాడారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సీపీఐ అలుపెరుగుని పోరాటా లు సీపీఐ చేసిందన్నారు. తిరుపతి చుట్టుపక్క ల 26 కాలనీలను ఏర్పాటు చేసి, పేదలకు ఇంటి స్థలాలు కల్పించడంలో కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించనున్నట్లు తెలిపారు. ఆగస్టులో పార్టీ రాష్ట్ర మహాసభ, సెప్టెంబర్‌లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు నిర్వహిస్తారని, ఈ సభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, రాధాకృష్ణ, ఎస్‌డీ.రవి, గోవిందస్వామి, శ్రీనివాసులు, రామకృష్ణ, హమాలీ యూనియన్ నేతలు, సభ్యుల పాల్గొన్నారు.

వైభవం.. సుందరరాజస్వామివారి కటాక్షం



పెద్ద శేషవాహనంపై స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరింద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.